సాక్షి జగిత్యాల

శుక్రవారం ׀ 2 ׀ ఫిబ్రవరి ׀ 2024



ఆ పల్లెలకు పసుపు తోటలే అందం

జిల్లాలో వరి, మొక్కజొన్న తర్వాత అధికంగా పసుపు పంటను సాగు చేస్తారు. ప్రస్తుతం దాదాపు 20 వేల ఎకరాల్లో సాగు చేశారు.

IIలో▸



డయల్ 100.. సత్వర సేవలు

జిల్లాలో డయల్ 100కు స్పందన వస్తోంది. ఆపదలో ఉన్నవారిని రక్షించడంతోపాటు, ప్రమాదం జరిగిన స్థలానికి క్షణాల్లో చేరుకుంటున్నారు.

IIలో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32.0/20.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌ది పేదల ప్రభుత్వం



గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్: కాంగ్రెస్ పేదల పక్షపాతి అని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని కిషన్‌రావుపేట పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో మరో రెండు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. మండలంలోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ మేరుగు మురళి, ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, యూత్ అధ్యక్షుడు పూదరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలి



రాయికల్‌లో మాట్లాడుతున్న బోగ శ్రావణి

రాయికల్: ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు బోగ శ్రావణి పార్టీ కార్యకర్తలకు సూచించారు. గురువారం గావ్ చలో – బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా రాయికల్, మండలంలోని అల్లీపూర్‌లో సమావేశాలు నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించి మోదీని మళ్లీ ప్రధానిగా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ కో–కన్వీనర్ గుంటుక సదాశివం, పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, ఎంపీటీసీ మహేశ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కన్వీనర్ సామల్ల సతీశ్, కో–కన్వీనర్ గోపి, మచ్చ నారాయణ, మారుతి, కుర్మ మల్లారెడ్డి, మంగళారపు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో పశువైద్య శిబిరం



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గొల్లపల్లి: జిల్లా పశువైద్యాధికారి వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని తిర్మలాపూర్, రాఘవపట్నం, ఇస్రాజ్‌పల్లిలో కోరుట్ల పశువైద్యశాల, జిల్లా పశుసంవర్ధక శాఖ గురువారం ప్రత్యేక పశువైద్య శిబిరం నిర్వహించాయి. 300 పశువులకు గర్భకోశవ్యాధులకు చికిత్స అందించారు. 200 మెడిసిన్, 10 శస్త్రచికిత్సలు నిర్వహించారు. కృత్రిమ గర్భధారణ, సక్సెస్‌సెవెన్‌తోపాటు వివిధ అంశాలపై రైతులకు వేణుగోపాల్‌రావు అవగాహన కల్పించారు. కోరుట్ల వెటర్నరీ కళాశాల అసోసియేట్ మాధవరావు, టీఎస్ఎల్‌డీఏ కరీంనగర్ ఈవో శ్రీధర్, మండల పశువైద్యాధికారి రవీందర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంబిక, వైద్యులు సురేశ్, పర్శురాములు, తిరుగగౌడ్, బద్దం రాజేందర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతీ నియోజకవర్గానికి రూ.10 కోట్లు

సాక్షి,పెద్దపల్లి: ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆమోదంతో అభివృద్ధి పనులు చేపట్టాలని సదరు జీవోలో పేర్కొంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాలకుగాను ఒక్కోదానికి రూ.10 కోట్ల చొప్పున మొత్తం 130 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ప్రతీ అసెంబ్లీ పరిధిలో రూ.2 కోట్లు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం, రూ.కోటి మంచి నీటి వసతి కల్పించేందుకు, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ ఖర్చులకు రూ.50 లక్షలు ఖర్చు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

మున్సిపల్ డీఈగా యాదగిరి

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీ డీఈగా యాదగిరి నియమితులయ్యారు. కొద్దికాలంగా హౌసింగ్ డీఈ రాజేశ్వర్ మున్సిపల్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఆ స్థానంలో యాదగిరిని నియమించారు.



రైల్వేకు పెద్దపీట

ఉమ్మడి జిల్లాకు రూ.673.43 కోట్లు

- గతేడాది రూ.647 కోట్లు
- మనోహరాబాద్–కొత్తపల్లికి రూ.350 కోట్లు
- కాజీపేట–బల్లార్షా మూడోలైన్‌కు రూ.300 కోట్లు
- మణుగూరు–రామగుండం కోల్‌కారిడార్ లైన్‌కు రూ.5 కోట్లు
- ఊసేలేని తిరుపతికి అదనపు సర్వీసులు
- పెద్దపల్లి–నిజామాబాద్ డబ్లింగ్‌కు కలగని మోక్షం

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

కేంద్రం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యం పెరిగింది. గతేడాది కేటాయించిన రూ.647 కోట్ల కంటే స్వల్పంగా పెంచింది. రూ.673.43 కోట్లు కేటాయించింది. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్‌కు పెద్దపీట వేసింది. గతేడాది రూ.185 కోట్లు కేటా యించగా ఈసారి ఏకంగా రూ.350 కోట్లు కేటాయించడం, కాజీపేట–బల్లార్షా మూడోలైన్ కోసం రూ.300 కోట్లు ఇస్తామని ప్రకటించడం విశేషం.

కొత్తపల్లి–మనోహరాబాద్‌కు రూ.350 కోట్లు

ఉమ్మడి జిల్లా వాసులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టు కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ పనుల కోసం కేంద్రం రూ.350 కోట్లు కేటాయించింది. ఇందులో రాష్ట్ర వాటాగా రూ.112 కోట్ల వరకు వెచ్చించాలి. గతేడాది రూ.185 కోట్లను మాత్రమే కేటాయించడం గమనార్హం. ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని 2016లో కేంద్రాన్ని ఒప్పించింది. రూ.1,167 అంచనా వ్యయంతో ప్రారంభించి ఇప్పటి వరకూ మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు లైన్ పూయి, రైలుసేవలు అందుబాటులోకి వచ్చాయి. మొత్తం 151 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గం ఇప్పటి వరకూ 75 కి.మీ పూర్తయింది. ప్రస్తుతం సిరిసిల్ల–సిద్దిపేట(37 కి.మీ) భూసేకరణలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఈ నిధులతో సమసిపోనున్నాయి.

ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల కేటాయింపులు ఇలా..

కొత్తపల్లి– మనోహరాబాద్ (148.9 కిమీ)	రూ.350 కోట్లు
కాజీపేట– బల్లార్షా మూడోలైన్	రూ.300 కోట్లు
బల్లార్షా–రామగుండం ఎలక్ట్రిక్ అప్‌గ్రేడేషన్	రూ.18.43 కోట్లు
మణుగూరు–రామగుండం (200 కి.మీ)	రూ.5 కోట్లు
మందమర్రి–రాఘవాపురం	రూ.5 లక్షలు
రాఘవాపురం–రామగుండం (ఆర్వోబీ)	రూ.10,000
పెద్దపల్లి–కరీంనగర్–నిజామాబాద్ (177 కి.మీ)	రూ.1000
పెద్దపల్లి బైపాస్–కరీంనగర్ లైన్ (2.169 కి.మీ)	
కనెక్ట్ బల్లార్షా– కాజీపేట మెయిన్‌లైన్	రూ.1000
కొలనూరు– పెద్దపల్లి–ఆర్వోబీ	రూ.10,000

కాజీపేట–బల్లార్షా మూడోలైన్ రూ.300 కోట్లు

కాజీపేట–బల్లార్షా మూడోలైన్‌కు రూ.300 కోట్లు కేటాయించింది. గతేడాది రూ.450 కోట్లు కేటాయించిన కేంద్రం ఈసారి పనులు పూర్తవుతున్న నేపథ్యంలో రూ.300 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే ఈ మార్గంలో మూడు లైన్లలోనూ రైళ్లు తిరుగుతుండడం విశేషం.

రామగుండం–మణుగూరుకు రూ.5 కోట్లే

కోల్‌కారిడార్‌గా పిలుస్తోన్న రామగుండం(రాఘవాపురం)–మణుగూరు రైల్వేలైన్‌కు ఈసారి నిధులు తగ్గాయి. రామగుండం– మణుగూరు మధ్య ప్రస్తుతం ఉన్న 290 కి.మీలను 200 కి.మీలకు తగ్గించేందుకు భూపాల్లి మీదుగా వేస్తున్న ఈలైన్ అంచనా విలువ రూ.3వేల కోట్లు. 2022 డిసెంబరులో ఈ మార్గానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఎంతో ఆర్థిక ప్రాముఖ్యత ఉన్న ఈలైన్‌కు ఇంత తక్కువ కేటాయించడం తీవ్ర నిరాశకు గురిచేసింది.

పెద్దపల్లి బైపాస్‌కు..

పెద్దపల్లి–కరీంనగర్ మార్గాన్ని కాజీపేట–బల్లార్షా మార్గంతో కలుపుతున్న పెద్దపల్లి బైపాస్‌లైన్‌కు రూ.1000 కేటాయించారు. ఈ మార్గంలో పనులు వేగిరమైనప్పటికీ భూసేకరణ, స్టేషన్ నిర్మాణ పనులు ఇప్పటికే ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో రూ.1000 కేటాయించడం గమనార్హం.

ఊసేలేనివి ఇవే..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిమాండ్ ఉన్న కరీంనగర్–తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల పెంపుపై కేంద్రం ఎలాంటి ప్రకటన చేయకపోవడం నిరాశకు గురిచేసింది. వాస్తవానికి ఈ రైళ్లలో కోచ్‌లు సరిపోక కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, మంచిర్యాల, మందమర్రి నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లి–నిజామాబాద్ డబ్లింగ్ పనులకు బడ్జెట్‌లో చోటు దక్కకపోవడం గమనార్హం.

ఉత్తుత్తి బడ్జెట్



కేంద్రం బడ్జెట్ కేటాయింపులు అంతా ఎన్నికల జిమ్మిక్. ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు లేవు. కాంగ్రెస్ హయాంలో నేను తెచ్చిన తిరుపతి రైలు కనీసం సర్వీసులు కూడా పెంచలేదు. మణుగూరు – రామగుండం కోల్ కారిడార్ కు రూ. 5 కోట్లు ఇవ్వడం ఏంటి? ఇలా అయితే ఈ ప్రాజెక్టులు ఎన్నడు పూర్తవుతాయి? ఇదంతా ఉత్తుత్తి బడ్జెట్. – పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి

త్వరలో తిరుపతి రైళ్లపై..



గతేడాది కంటే ఈసారి దాదాపు రూ.30 కోట్ల బడ్జెట్ పెరిగింది. ఉమ్మడి జిల్లాకు కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనం. తిరుపతి రైళ్ల విషయంలో త్వరలో ప్రకటన చేయిస్తాం. అమృత్ పథకం కింద కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లను ఆధునీకీకరిస్తున్నాం. జిల్లాకు నిధులు పెంచడంలో కీలకంగా వ్యవహరించిన రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు కృతజ్ఞతలు. – బండి సంజయ్, ఎంపీ

వేగం పెంచాలి



మనోహరాబాద్–కొత్తపల్లి పనులను నేను ఎంపీగా ఉన్న సమయంలో ప్రారంభించాం. ఈసారి రూ.350 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. ఉమ్మడి జిల్లా వాసులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టును మేం సిద్దిపేట వరకు తీసుకొచ్చాం. ఒప్పందం ప్రకారం 2025 డిసెంబరు నాటికి కరీంనగర్ వరకు అందుబాటులోకి తేవాలి. – వినోద్, మాజీ ఎంపీ

ధర్మపురి చేరుకున్న ఆరోగ్యశాఖ మంత్రి



ధర్మపురిలో మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

- స్వాగతం పలికిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి
- నేడు నృసింహాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు

ధర్మపురి: రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్‌అండ్‌టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం రాత్రి ధర్మపురి చేరుకున్నారు. ఆయనకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి స్వాగతం పలికారు. ఆయనకు స్థానిక జువ్వాడి రత్నాకర్‌రావు ఏసీ ఫంక్షన్ హాలులో విడిది ఏర్పాటు చేశారు. పుణ్యక్షేత్రంలో చేపట్టే పలు అభివృద్ధి అంశాలపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మంత్రితో చర్చించారు.

నేడు నృసింహుడికి పూజలు

మంత్రి సతీసమేతంగా శుక్రవారం శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటారని ఈవో శ్రీనివాస్ తెలిపారు. హోమం, నిత్య కల్యాణంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



పాల్గొన్న పోలీసు అధికారులు

- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: పోలీసులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. స్థానిక ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో పోలీస్‌శాఖ ఉపయోగిస్తున్న ఐసీజేఎస్, టీఎస్‌కాప్, సీసీటీఎన్ఎస్‌పై గురువారం శిక్షణ కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ నిందితుల అరెస్ట్ సమయంలో పూర్తి వివరాలు సేకరించాలని, వాటిని సీసీటీఎన్ఎస్ ప్రాజెక్ట్‌లో నమోదు చేయాలని, వారి క్వాలిటీ డాటా కూడా ఉండాలని తెలిపారు. డాటాబేస్ ద్వారా అనేక కేసులు చేధించవచ్చని సూచించారు. చిన్న తప్పిదం కూడా లేకుండా డాటా ఎంట్రీ చేయాలన్నారు. పోలీసు శాఖలో సాంకేతిక వ్యవస్థ కీలకభాగంగా ఉందని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యంలో రోజువారీ పురోగతి సాధించాలన్నారు. అనతరం ఆయా అప్లికేషన్ల పనితీరుకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఐటీ కోర్ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రవీంద్రరెడ్డి, సీఐ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లలో పనులు.. బల్దియా వేతనాలు

- మున్సిపల్‌లో పనిచేయని పదిమందికి జీతాలు
- నెలకు రూ.లక్షన్నరకుపైగానే చెల్లింపులు
- కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో వెలుగులోకి

జగిత్యాలకు చెందిన ఇద్దరు పారిశుధ్య కార్మికులు అక్కడి ఓ ఉన్నతాధికారి ఇంట్లో పని చేస్తున్నారు. వారిద్దరికీ మెట్‌పల్లి మున్సిపాలిటీ నుంచి ప్రతినెలా వేతనాలు చెల్లిస్తున్నారు. ఆ ఇద్దరు ఇక్కడి మున్సిపాలిటీలో ఏ ఒక్కరోజూ పనిచేసింది లేదు. అయినా అధికారులు వారికి దర్జాగా జీతం చెల్లిస్తుండడం గమనార్హం.

నియోజకవర్గానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఫాంహౌజ్‌లో ఓ యువకుడు పని చేస్తున్నాడు. అతడి పేరును మున్సిపల్ పారిశుధ్య కార్మికుల జాబితాలో నమోదు చేసి బల్దియా నుంచి వేతనం ఇస్తున్నారు. అతడు కార్మికుడిగా ఏ రోజుకూడా తట్ట, పారపట్టి పనిచేయలేదు.



మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

మెట్‌పల్లి: మెట్‌పల్లి మున్సిపాలిటీ నిధులు పనిచేయని పారిశుధ్య కార్మికులకు కూడా వేతనాల రూపంలో దుర్వినియోగం అవుతున్నాయి. బల్దియాలో పనిచేయని సుమారు పదిమందికి కార్మికుల పేరిట అక్రమంగా వేతనాలుగా చెల్లిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఒత్తిళ్లకు తలొగ్గి స్థానిక అధికారులు పెద్ద మొత్తంలో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్ ఇంట్లో పనిచేస్తున్న వారికి కూడా మున్సిపల్ నుంచి వేతనాలు చెల్లిస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఇటీవల బహిర్గతం చేయడం.. జరుగుతున్న పరిణామాలు కూడా అలాగే ఉండడం గమనార్హం. ప్రజాప్రతినిధుల ఇళ్లు, ఫాంహౌజ్‌లతోపాటు జిల్లా కేంద్రంలోని ఓ ఉన్నతాధికారి ఇంట్లో పనిచేస్తున్న ఇద్దరికి కూడా మెట్‌పల్లి మున్సిపల్ నుంచే వేతనాలు చెల్లిస్తున్నట్లు వెలుగులోకి రావడం విశేషం. ఇలా మున్సిపల్‌లో పనిచేయకున్నా.. మొత్తం పది మందికి ప్రతినెలా వేతనాలు అందిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

పారిశుధ్య కార్మికులుగా నమోదు..

ఉన్నతాధికారి, ప్రజాప్రతినిధుల ఇళ్లలో డ్రైవర్, వంట పనిచేస్తున్న వారిని మున్సిపల్‌లో పారిశుధ్య కార్మికులుగా చూపుతున్నారు. ప్రస్తుతం మున్సిపల్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 180 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో పారిశుధ్య కార్మికులు 140మంది ఉన్నారు. వీరు ప్రతి రోజు ఉదయం 5గంటలకు విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. హాజరు, గైర్హాజరు అయిన వారి వివరాలను రిజిస్టర్‌తోపాటు బయోమెట్రిక్ యంత్రంలో నమోదు చేస్తున్నారు. అయితే ఈ పదిమంది విధులకు రాకపోయినా వచ్చినట్లు చూపుతూ ఒక్కొక్కరికి ప్రతినెలా రూ.15,600 చొప్పున నెలకు రూ.లక్షన్నరకుపైగానే వేతనాల రూపంలో ఇస్తున్నారు. ఇలా ఇప్పటివరకు సుమారు రూ.కోటి వరకు అక్రమంగా చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది.

“కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్ ఇళ్లలో పని చేస్తున్న వారికి మున్సిపల్ నుంచి వేతనాలు ఇప్పించడం సిగ్గుచేటు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. వారిపై చర్యలు తీసుకోవాలని కోరాం. – జువ్వాడి కృష్ణారావు, పీసీసీ సభ్యుడు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



ఇతర చోట్ల పనిచేస్తూ మున్సిపల్ నుంచి వేతనాలు తీసుకుంటున్న వారి వివరాలు సేకరిస్తున్నాం. అలాంటి వారిని గుర్తించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం. – జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్”

నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన

- ముగిసిన సర్పంచుల పదవి
- గెజిటెడ్ అధికారులకు బాధ్యతలు

ధర్మపురి: గ్రామపంచాయతీల్లో ఇకనుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనున్నది. పాలకవర్గం పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ పాలన బాధ్యతలను జిల్లా, మండల స్థాయి అధికారులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించగా.. గెలిచిన వారు అదే ఏడాది ఫిబ్రవరి ఒకటిన బాధ్యతలు స్వీకరించారు. తాజాగా వారి పదవికాలం పూర్తివడంతో జిల్లాలోని 380 పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనకు రంగం సిద్ధం చేశారు.

అధికారులకు బాధ్యతలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీల బాధ్యతలు చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవో, ఎంఈవోలతోపాటు ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఏఈలు, ఏఈవోలు, డీటీవో, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు ప్రత్యేక పాలన కొనసాగించనున్నారు. గురువారం విడుదలైన జీవో ప్రకారం ప్రత్యేక పాలనలో కేవలం గెజిటెడ్ అధికారులే ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

పంచాయతీలు ఎక్కువ.. అధికారులు తక్కువ

జిల్లాలో 380 పంచాయతీలున్నాయి. ప్రభుత్వ జీవో ప్రకారం ఒక్కో పంచాయతీకి గెజిటెడ్ ఉద్యోగిని నియమించాలి. అయితే అందుకు సరిపడా గెజిటెడ్ అధికారులు జిల్లాలో లేరని, 2, 3గ్రామాలకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఒక్కో క్లస్టర్‌కు గెజిటెడ్ అధికారిని నియమించే అవకాశాలున్నాయని అధికారుల ద్వారా తెలిసింది.



రాజారం గ్రామపంచాయతీ

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

- 87 శాతం హాజరు

జగిత్యాల: జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 87శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం జనరల్ విభాగంలో 373 మంది విద్యార్థులకు 364 మంది, ఒకేషనల్‌లో 736 మందికి 595 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో జనరల్ విభాగంలో 144 మందికి 139 మంది, ఒకేషనల్‌లో 814 మందికి 726 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు.

క్లుప్తంగా

గంజాయి పట్టివేత



పోలీసుల అదుపులో నిందితులు

ధర్మపురి: గంజాయి విక్రయించేందుకు యత్నించిన ఇద్దరు యువకులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ ముత్యం తెలిపారు. సారంగాపూర్ మండలం రంగపేటకు చెందిన ధర్మారం అశోక్, అన్నవేణి గంగాధర్ బుధవారం ధర్మపురి సమీపంలోని తుమ్మెనాల గుట్ట వద్ద గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందింది. సీఐ ఆధ్వర్యంలో ఘటనా స్థలానికి చేరుకొని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని సోదా చేయగా వారి వద్ద 150 గ్రాముల గంజాయి లభించింది. యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



పతకం సాధించిన చరణ్‌తేజ

జగిత్యాల: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం శివ వీధిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థి శివ చరణ్‌తేజ ఇటీవల మంచిర్యాలలో నిర్వహించిన ఆలిండియా ఆల్‌స్టైల్ కరాటే చాంపియన్‌షిప్ అండర్- 14 విభాగంలో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించా డు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థిని అ భినందించారు. ఓటమి, గెలుపు స హజమని, విద్యార్థులు అన్నింట్లో పాల్గొనాలన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన రుద్ర శ్రీనివాస్ (54) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. శ్రీనివాస్ గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసై నిత్యం తిరుగుతుండేవాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని గురువారం ఎస్సై అజయ్ అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10,010 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఆ పల్లెలకు పసుపు తోటలే అందం

- ధర ఉన్నా.. లేకున్నా పంట సాగు
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: అనాదిగా ఆ గ్రామాలు పసుపు పంటకు పెట్టింది పేరు. లాభనష్టాలతో సంబంధం లేకుండా వ్యవసాయ భూమి ఉన్న ఆయా గ్రామాల రైతులు డ్రిప్ ద్వారా పసుపు పంట సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. జిల్లాలో పసుపు పంటను అత్యధికంగా సాగు చేసే గ్రామాలపై కథనం.



మేడిపల్లి మండలంలో సాగు చేసిన పసుపు తోట

దాదాపు 20 వేల ఎకరాల్లో..

జిల్లాలో వరి, మొక్కజొన్న తర్వాత అధికంగా పసుపు పంటను సాగు చేస్తారు. ప్రస్తుతం దాదాపు 20 వేల ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో పసుపు సాగు ఉన్నప్పటికీ అత్యధికంగా జగిత్యాల రూరల్‌మండలం లక్ష్మీపూర్, అంతర్గాం, నర్సింగాపూర్, ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతోపాటు ఎర్దండి, వర్షకొండ, కోమటి కొండాపూర్, మల్లాపూర్ మండల కేంద్రంతోపాటు మొగిలిపేట, దాంరాజ్‌పల్లి, సిర్‌పూర్, మెట్‌పల్లి మండలంలో వెల్లుల్ల, జగ్గాసాగర్, మెట్ల చిట్టాపూర్, కోరుట్ల మండలంలో మాదాపూర్, పైడిమడుగు, జోగిన్‌పల్లి, కథలాపూర్ మండలంలో తక్కళ్లపల్లి, భూషణ్‌రావుపేట, మేడిపల్లి మండలంలో కట్లకుంట, పోరుమల్ల, కమ్మరిపేట, రాయికల్ మండలంలో మైతాపూర్, కొత్తపేట, మూటపల్లి గ్రామాల్లో సాగవుతోంది. ఆయా గ్రామాల్లో దాదాపు 90 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. ఎస్సారెస్పీ నీటితో పాటు ప్రతీ రైతుకు రెండు మూడు వ్యవసాయ బావులున్నాయి. ఉచిత విద్యుత్‌ను ఉపయోగించుకుని బంగారం లాంటి పసుపు పంట పండిస్తున్నారు.

పెట్టుబడికి వెనకాడరు..

పంట బాగుండాలి కానీ ఎంత పెట్టుబడికైనా వెనకాడరు ఆయా గ్రామాల పసుపు రైతులు. ప్రతీ రైతు ఒక ఎకరం పసుపు సాగుకు విత్తనం కాకుండా దాదాపు రూ.80 వేల వరకు ఖర్చు పెడుతున్నారు. ఎకరాకు ఒక లారీ కోడి ఎరువు, ఒక లారీ పశువుల ఎరువు వేస్తుంటారు. నాణ్యమైన విత్తనాన్ని చేనులో ఏరుకుంటారు. అయితే గత నాలుగైదేళ్లుగా మార్కెట్‌లో పలుకుతున్న ధర రైతులకు కలిసిరావడం లేదు. అయినా పసుపుపై మమకారాన్ని మాత్రం వదలడం లేదు. పసుపులో అంతరపంటగా మొక్కజొన్న వేస్తారు. మొక్కజొన్నకు వచ్చే ఆదాయం సాగు ఖర్చుకు పోగా, పసుపు పంట ఆదాయం రైతులకు మిగులుతుంది. ఇటీవల కొంతమంది రైతులు పసుపు తీసిన తర్వాత ఖర్బుజాను సైతం అంతరపంటగా వేసి లాభాలు పొందుతున్నారు. పసుపు పంటను తవ్వేటప్పుడు, ఉడకబెట్టేటప్పుడు, మార్కెట్‌కు తీసుకెళ్లేటప్పుడు ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. ఇక్కడి రైతులు పండించిన పసుపు నాణ్యతగా ఉండటంతో నిజామాబాద్, సాంగ్లీ మార్కెట్‌కు తరలిస్తూ మంచి ధర పొందుతున్నారు.

20 ఏళ్లుగా..



ధర ఉన్నా, లేకున్నా పసుపు పంటను 20 ఏళ్లుగా సాగు చేస్తున్నా. ఏనాడు నాకు నష్టం రాలేదు. ఏటా ఎకరం నుంచి రెండెకరాలు సాగు చేస్తా. పసుపు తవ్వకం సమయంలో కూలీల కొరత వేధిస్తుంది.

– సందిరెడ్డి తిరుపతిరెడ్డి, కోరుట్ల

ఆర్థికంగా నిలదొక్కుకున్నాం



పసుపు పంటతోనే మా ఊర్లో చాల మంది ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. పసుపును ఇంటి పంటగా భావించి, అశుభాలు కలిగినప్పుడు పసుపు తోటలోకి వెళ్లరు. పసుపు సాగులో మహిళా రైతులు ఎక్కువ కష్టపడుతుంటారు.

– కొమ్ముల రాజేందర్‌రెడ్డి, కథలాపూర్

కొన్నేళ్లుగా ధర లేక..



జిల్లాలో గతంలో 30 వేల ఎకరాలకు పైగా పసుపు సాగు చేసేవారు. కొన్నేళ్లుగా ధరలు లేకపోవడంతో దిగుబడులు వచ్చినా పసుపు సాగు తగ్గించారు. ఇతర జిల్లాల పసుపు రైతులతో పోల్చితే ఇక్కడి రైతులు అన్నిరకాల యాజమాన్య పద్ధతులు పాటిస్తారు.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖాధికారి

డయల్ 100.. సత్వర సేవలు

- 2023లో 26,613 కాల్స్
- ప్రాణాలు కాపాడుతున్న సిబ్బంది

- ‘జగిత్యాల ప్రాంతానికి చెందిన ఓ యువతి జీవితంపై విరక్తితో మల్యాల రైల్వేస్టేషన్ సమీపంలో ఆత్మహత్య చేసుకుంటున్నానని ఆమె సోదరునికి ఫోన్ చేసింది. దీంతో అతను వెంటనే డయల్ 100కు కాల్ చేశాడు. వెంటనే పోలీసులు లొకేషన్ ఆధారంగా ఆ యువతిని కాపా డి కుటుంబసభ్యులకు అప్పగించారు.’
- జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులో ఇటీవల కొన్ని నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే కొందరు అగంతకులు నిర్మాణాలను కూల్చివేస్తుండగా గమనించిన కొందరు స్థానికులు డయల్ 100కు కాల్ చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోవడంతో అగంతకులు పరారయ్యారు.



డయల్ 100కు సమాచారం అందించిన వ్యక్తిని సన్మానిస్తున్న ఎస్పీ (ఫైల్)



డయల్ 100తో యువతిని రక్షించిన పోలీసులు (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాలో పోలీసుశాఖ ఏర్పాటు చేసిన డయల్ 100కు స్పందన వస్తోంది. ఆపదలో ఉన్నవారిని రక్షించడంతోపాటు, ప్రమాదం జరిగిన స్థలానికి క్షణాల్లో చేరుకుంటున్నారు. సంఘటనల తీరును చిత్రీకరించడంతోపాటు, సరైన సాక్ష్యాధారాలు సేకరిస్తున్నారు. ఇలా జిల్లాలో 2023లో 26,213 కాల్స్ డయల్ 100కు వచ్చాయి. ఈ ఏడాది జనవరిలో 1,641 కాల్స్ వచ్చాయంటే డయల్100 ఎలా పనిచేస్తోందో తెలుసుకోవచ్చు.

అనూహ్య స్పందన

జిల్లాలో దోపిడీ, దొంగతనాలు, తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, హత్యలు, హత్యాయత్నాలు, ఆత్మహత్యలు, తప్పి పోవుట, కిడ్నాప్, అత్యాచారయత్నాలు, గృహహింస, అసాంఘిక కార్యకలాపాలు, ఆపదలు సంభవించిన సందర్భంలో ప్రజలు డయల్ 100 సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

చలానాల చెల్లింపు గడువు పెంపు

వాహనాల పెండింగ్ చలానాల చెల్లింపునకు ప్రభుత్వం ఈనెల 15వరకు గడువు పెంచిందని ఎస్పీ తెలిపారు. బైక్, ఆటోలు 80శాతం, ఆర్టీసీ బస్సులకు 90 శాతం, ఇతర వాహనాలకు 60శాతం రాయితీ ఉందని, వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తక్షణ సేవలు



ఆపదలో ఉన్నవారు, ప్రమాదంబారినపడిన వారు డయల్ 100కు కాల్ చేస్తున్నా రు. ఇది మంచి పరిణామం. పోలీసులు వెంటనే స్పందించి వారికి సేవలందిస్తున్నారు.నెల రోజుల్లోనే జిల్లాలో రెండు నిండు ప్రాణాలను కాపాడడం సంతృప్తిగా ఉంది.

– సన్‌ప్రీత్‌సింగ్, ఎస్పీ

ఆస్పత్రుల్లో లైవ్ సర్జరీలు

- ఆర్థోపెడిక్ వైద్యుల రాష్ట్ర సదస్సు ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్థో వైద్యులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో మొట్ట మొదటిసారి నిర్వహిస్తున్న 9వ తెలంగాణ రాష్ట్ర ఆర్థోపెడిక్ వైద్యుల సదస్సు గురువారం వీ-కన్వెన్షన్‌లో ప్రారంభమైంది. సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్థో వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటి రోజు కరీంనగర్‌లోని నాలుగు ఆస్పత్రుల్లో లైవ్ సర్జరీలు నిర్వహించగా, సదస్సుకు హాజరైన వైద్యులు వీక్షించారు. రెనే హాస్పిటల్‌లో ఆర్థోస్కోపీ- టోటల్ హిప్ రీప్లేస్మెంట్ సర్జరీని డాక్టర్ బంగారిస్వామి, చల్మెడ ఆనందరావు వైద్య కళాశాలలో ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ డాక్టర్ కేతన్ దేశ్‌పాండే, ప్రతిమ వైద్య కళాశాలలో రోబోటిక్ ద్వారా మోకాలు కీలు మార్పిడి విధానం డాక్టర్ మోతీలాల్, హోటల్ శ్వేత కాన్ఫరెన్స్ హాల్‌లో పెల్విఎసిటాబులం సర్జరీ డాక్టర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్ని ప్రాంతాల నుంచి లైవ్ కవరేజీ చేపట్టి వైద్యులు, పీజీ విద్యార్థులు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ప్రారంభ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ టి.కరుణాకర్‌రావు, రజనీ ఫెర్టిలిటీ సెంటర్ ఫౌండర్ డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని, కోర్స్ డైరెక్టర్ డాక్టర్ జయప్రసాద్, కో డైరెక్టర్ డాక్టర్ విజయభాస్కర్, ఫ్యాకల్టీ మెంబర్లు శ్రీనివాస్ కాశా, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్ వేముల, సాయి తిరుమలరావు, సుధీర్ ద్వారక్‌నాయుడు, ఉదయ్‌కృష్ణ, సాయిలక్ష్మణ్ అన్నే, కిరణ్ కొక్కిరాల, శ్రీనివాస్ ఎగ్గన, ప్రవీణ్‌రెడ్డి, పవన్‌కుమార్, సూర్యప్రకాష్, సురేశ్ చీకట్ల, రాజు అయ్యంగార్, ముకేశ్ లడ్డా, కో ఆర్గనైజర్ అభిలాష్, ఉదయ్‌కుమార్, కె.వంశీధర్‌రెడ్డి, నర్సింహులు, శివకుమార్, అశోక్‌రాజు, అతుల్, నాగరాజు, ప్రవీణ్, వంశీ ఛాట్ల తదితరులు పాల్గొన్నారు.

‘బిట్‌కాయిన్’లో నష్టపోయి..

- ఉస్మానియా ఎంకాం విద్యార్థి ఆత్మహత్య
- మృతుడిది జగిత్యాల జిల్లా కోరుట్ల



నవీన్(ఫైల్)

కోరుట్ల: బిట్ కాయిన్‌లో నష్టపోయి జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఎంకాం విద్యార్థి ఎర్ర నవీన్ (24) హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆయన మృతదేహాన్ని బుధవారం రాత్రి కోరుట్లకు తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. కోరుట్లలో వడ్రంగి పనిచేస్తున్న ఎర్ర శ్రీనివాస్ కుమారుడు నవీన్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంకాం సెకండియర్ చదువుతున్నాడు. కొంతకాలంగా బిట్‌కాయిన్‌లో డబ్బు పెట్టాడు. అందులో సుమారు రూ.4లక్షల వరకు పోగొట్టుకుని అప్పుల పాలైనట్లు తెలిసింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది మంగళవారం వేకువజామున గడ్డి మందు తాగాడు. గమనించిన స్నేహితులు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన మృతదేహానికి కోరుట్లో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ



శిరీషను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

మల్లాపూర్(కోరుట్ల): మెట్‌పల్లి పట్టణంలో గత నెల 9న జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో మల్లాపూర్ మండలం సాతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బుర్రి శిరీష ప్రతిభ కనబర్చడం అభినందనీయమని హెచ్‌ఎం శ్రీహరి అన్నారు. గురువారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందంతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ అండర్-14 బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో శిరీష జిల్లాస్థాయిలో రెండో బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు సుమలత, ఎంపీటీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్ విజయవంతం

- 45 మంది బాలకార్మికులకు విముక్తి
- ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

జగిత్యాలక్రైం: అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ విజయవంతమైందని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండుసార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఆపరేషన్ స్మైల్ విజయవంతం కోసం ఒక్కో సబ్ డివిజన్ పరిధిలో ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక మహిళ కానిస్టేబుళ్లను ప్రత్యేకంగా కేటాయించి చైల్డ్ లైన్‌తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. తనిఖీల్లో ఈ సంవత్సరం జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని నిర్వహించి 45 మంది బాలకార్మికులను గుర్తించి చైల్డ్‌వెల్ఫేర్ కమిటి ముందు హాజరుపర్చడం జరిగిందన్నారు. 45 మంది బాలకార్మికుల లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 18 మందిని, రిహాబులేషన్ సెంటర్‌కు తరలించి వారిని స్కూల్‌లో చేర్పించడం జరిగిందన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 27 మందిని వారి రాష్ట్రాలకు పంపించి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు బాధ్యతయుతంగా కృషి చేయాలన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందన్నారు. బాలలను పనిలో పెట్టుకున్నా, పనిచేసిన, వదిలివేయబడిన బాలల సమాచారం డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

కరీంనగర్: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్షం బడ్జెట్ భేష్ అంటుంటే.. విపక్షాలు పెదవి విరిచాయి. ప్రజాసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్ అని అధికార పక్షం అంటుండగా.. సంపన్నవర్గాలకు కొమ్ముకాస్తూ పేదల నడ్డివిరిచేలా బడ్జెట్ ఉందని విపక్ష పార్టీలకు చెందిన పలువురు అభిప్రాయపడ్డారు.

ఉద్యోగులకు తీవ్ర నష్టం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగస్తులకు పూర్తిగా నిరాశజనకంగా ఉంది. కొత్త, పాత ఆదాయపు పన్ను అంశాల్లో ఏ విధానంలో చూసినా ప్రభుత్వ ఉద్దేశం పన్ను వసూలు చేయడం అనేది స్పష్టంగా కనబడుతుంది. ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచాలి. టాక్సిబుల్ ఇన్‌కంను రూ.7 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలి. స్లాబులు కూడా 5శాతం నుంచి ఉండాలి. కానీ ఏకంగా 15 నుంచి 20శాతం విధిస్తున్నారు. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంలో ఏనాడు ఉద్యోగస్తులకు ఇన్‌ఎం ట్యాక్స్ విధానంలో లాభం జరగలేదు.

– ఊకంటి విజయేందర్‌రెడ్డి, ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు

నిరాశపర్చిన బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశపర్చింది. 3 లక్షల కోట్లు బడ్జెట్ పెంచి చూపించినా 11 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపులకు చూపడం దేశ ఆర్థిక పరిస్థితికి నిదర్శనంగా కనిపిస్తుంది. దేశవ్యాప్తంగా కూడు, గూడు, గుడ్డ లేని కోట్లాదిమంది ప్రజలు నేటికీ ఉన్నారు. వారందరికీ కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. నూటికి 60 శాతం ఉన్న రైతాంగాన్ని విస్మరించారు.

– మిల్కూరి వాసుదేవారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

విద్యారంగాన్ని విస్మరించారు



కేంద్రం మధ్యంతర బడ్జెట్ విద్యారంగం, తెలంగాణ విద్యార్థి లోకాన్ని పూర్తిగా విస్మరించింది. విద్యారంగానికి 10శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ప్రాధాన్యత నిధులు కూడా ఇవ్వలేదు. కరీంనగర్‌లో ఐఐటీ ఏర్పాటు చేయాలని విభజన హామీ చట్టంలో ఉన్నా స్థానిక ఎంపీ ఐఐటీని తీసుకురావడంలో విఫలమయ్యారు. విద్యార్థులపై భారంగా ఉన్న స్టేషనరీ వస్తువులపై జీఎస్టీ ఎత్తివేయకుండా, నిరుద్యోగ యువత ఆకాంక్షలకు వ్యతిరేకంగా ఈ బడ్జెట్ ఉంది.

– కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ప్రగతిపథంలో నడిపించే బడ్జెట్



పేదలు, రైతు సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. సోలార్ ఎనర్జీని సబ్సిడీల ద్వారా ప్రోత్సహించి ప్రతి కుటుంబానికి కరెంట్ బిల్లుల నుంచి ఉపశమనం కల్పించే బడ్జెట్. దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతను ఇచ్చి బడ్జెట్ రూపొందించడం అభినందనీయం.

– పి.సుగుణాకర్‌రావు, బీజేపీ సీనియర్ నాయకుడు

అన్నివర్గాలకు మేలు చేసేలా..



మోదీ ప్రభుత్వం సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ లక్ష్యంగా పేదలకు ఇళ్ల నిర్మాణం, రక్షణ, ఉపరితల రవాణా, జాతీయ రహదారులు, రైల్వే, ఆహార ప్రజా పంపిణీ, హోంశాఖ, గ్రామీణాభివృద్ధి, ఎరువులు, రైతు సంక్షేమం, ఆయుష్మాన్ భారత్‌కు పెద్దపీట వేయడం శుభపరిణామం.

– గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఇన్‌కం ట్యాక్స్‌లో మార్పులు లేవు



2024–25 సంవత్సరానికి ఇన్‌కం ట్యాక్స్‌లో ఎలాంటి మార్పులు లేవు. ఆదాయ పన్ను స్లాబ్‌ల ప్రకారం రూ.7 లక్షల వరకు కొత్త రిజిన్‌లో సెక్షన్ 87 ఏ ప్రకారం మినహాయింపు ఉంది. పాత టేబుల్ ప్రకారం రూ.5 లక్షల వరకు సెక్షన్ 87ఏ ప్రకారం కార్పొరేట్ పనుల్లో కొంత శాతం తగ్గించడం జరిగింది. సోలార్ పవర్‌ను ప్రోత్సహించడం కొంతవరకు హర్షించ దగ్గ విషయం.

– కె.వెంకటేశ్వర్లు, అడ్వకేట్

పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో..



వ్యవసాయ రంగ పురోభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ బడ్జెట్‌లో రూ.1.27 లక్షల కోలు కేటాయించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి కి రూ.7,105 కోట్లు. ఆహార శుద్ధి పరిశ్రమలకు రూ.3,290 కోట్ల కేటాయింపు. ఎరువుల ఖర్చు రూ.3 వేల నుంచి రూ.600 తగ్గించేలా సంప్రదాయ ఎరువుల స్థానంలో నానో డీఏపీని విస్తరించడం, నూనెగింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడం వంటి చర్యలు వ్యవసాయ అభివృద్ధికి ఊతమిస్తాయి.

– డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, తెలంగాణ ఎకనామిక్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఇన్‌కంటాక్స్ స్లాబ్ పెంచాలి



కోల్‌సిటీ(రామగుండం): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఇన్‌కంటాక్స్ స్లాబ్ పెంచాలి. రైల్వేకు గతంలో మాదిరిగా ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చెయ్యాలి. ఖాళీలను భర్తీ చేయాలి. మహిళా లోకో పైలట్స్‌కు రైలింజన్‌లో టాయిలెట్స్, ఏసీలు తదితర కనీస సౌకర్యాలు కల్పించాలి.

– అజ్మీరా వీరన్ననాయక్, రామగుండం బ్రాంచ్ సెక్రెటరీ, దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్

ఎటువంటి మార్పు లేదు



కోల్‌సిటీ(రామగుండం):ఆదాయ పన్ను చెల్లింపుదారులను బడ్జెట్ నిరాశపరిచింది. గత ఏడాది ప్రకారమే పన్నులు ఉన్నాయి. ఎలాంటి మార్పులు చేయలేదు. బహుళ సెక్షన్ల రాయితీని అనుమతించే పాత పన్ను విధానంలో ఈ బడ్జెట్‌లో ఎటువంటి మార్పు లేదు.

– ఎం.వెంకటేశం, ఇన్‌కంట్యాక్స్ ప్రాక్టీషనర్, గోదావరిఖని

యథాతథంగా స్లాబ్‌లు



సిరిసిల్లకల్చరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదాయపు పన్ను పరిమితిని ఈసారైనా పెంచుతారని ఆశించారు. వేతన జీవులకు ఈ విషయంలో నిరాశే మిగిలింది. పన్ను పరిమితిని పెంచాలని ఎన్నో ఏళ్లుగా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఆదాయపు పన్ను స్లాబ్‌లు యథాతథంగా ఉంచుతున్నట్లు ఆర్థికమంత్రి ప్రకటించారు. ఇది వేతన జీవులకు తీవ్ర నిరాశ కలిగించింది.

– పాకాల శంకర్‌గౌడ్, టీఎస్‌యూటీఎస్ అధ్యక్షుడు

విద్యకు కేటాయింపులు సరిపోవు



సిరిసిల్లకల్చరల్: బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించింది ఏ మాత్రం సరిపోదు. మొత్తం బడ్జెట్‌లో 2.61 శాతం మాత్రమే కేటాయించడం విద్యారంగ ప్రమాణాలు మెరుగుపరచదు. నినాదాలు, ఉపన్యాసాలతో ప్రామాణిక విద్య సాధ్యం కాదు. నిధుల కొరతతో కొత్త సంస్థల స్థాపన వీలుకాదు. మరిన్ని విద్యావకాశాలు పెంచేలా కేటాయింపులు ఉండాలి.

– దోర్నాల భూపాల్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

మార్పు చేయలేదు



సిరిసిల్లటౌన్: ఐటీ తదితర పన్నుల్లో ఏలాంటి మార్పులు చేయలేదు. ఇది సామాన్యులపై ఏలాంటి ప్రభావం చూపదు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, దేశ భద్రత, దేశీయ టూరిజానికి ప్రాధాన్యత ఇచ్చారు. కమ్యూనికేషన్స్ వ్యవస్థ, టెంపుల్ టౌన్స్ అభివృద్ధికి నిధులు కేటాయించడం ఆహ్వానించదగిన అంశం.

– జిందం రమేశ్, ట్యాక్స్ కన్సల్టెంట్, సిరిసిల్ల

ఆదాయ పన్ను వర్గాలకు నిరాశ



కథలాపూర్/ కోరుట్ల: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయ పన్ను వర్గాలకు నిరాశ మిగిలింది. గతేడాది ప్రతిపాదించిన పన్ను విధానాన్ని ఈసారి కొనసాగించారు. బడ్జెట్‌లో కేంద్రం ఆర్భాటం చేసింది తప్ప ఆచరణలో ఏమి చేయలేదని ఉద్యోగ ఉపాధ్యాయుల్లో నిరాశ వ్యక్తమవుతుంది.

– తులసి ఆగమయ్య, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, కోరుట్ల

రైల్వే సౌకర్యం విషయంలో నిర్లక్ష్యం



కథలాపూర్/ కోరుట్ల: జిల్లా వాసులు ఉపాధి నిమిత్తం మహారాష్ట్రలోని ముంబయి, పూణె, షిర్డీకి వెళ్తుంటారు. కానీ జిల్లా వాసులు మహారాష్ట్ర వెళ్లాలంటే రైల్వే సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. గతంలో ఉన్న రైల్వే సర్వీసులను రద్దు చేయడం బాధాకరం. రైల్వే బడ్జెట్‌కు ప్రత్యేకంగా కేటాయించకపోవడం సమంజసంకాదు.

– వాసాల విజయ్, యువ రచయిత, కోరుట్ల